

19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 14 జనవరి 2026








అరకొర బాండ్లతో..

## ఘరానా మోసం

టౌన్ ప్లానింగ్‌లో అడ్డగోలు వ్యవహారం..
అక్రమ నిర్మాణదారులతో అధికారుల కుమ్మక్కు

కృష్ణానదీ తీరంలో టౌన్ ప్లానింగ్ అవినీతి ప్రవాహం

లక్షల్లో దండుకుని.. అక్రమ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్

రఘు రోడ్డులో బిల్డింగ్ ఇన్స్పెక్టర్ అవినీతి ఫీట్లు..
ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు



వివరాలు 2లో...







# అరకొర బాండ్లతో ఘరానా మోసం

**టౌన్ ప్లానింగ్‌లో అడ్డగోలు వ్యవహారం.. అక్రమ నిర్మాణదారులతో అధికారుల కుమ్మక్కు**

**కృష్ణానదీ తీరంలో టౌన్ ప్లానింగ్ అవినీతి ప్రవాహం**

**లక్షల్లో దండుకుని.. అక్రమ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్**

**రఘు రోడ్డులో బిల్డింగ్ ఇన్స్పెక్టర్ అవినీతి ఫీట్లు.. ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్లానుకు విరుద్ధంగా ఒక్క ఇటుక పెట్టినా సహించేది లేదు.. అక్రమ నిర్మాణాలకు పాల్పడితే అస్సలు ఊరుకోం.. నగరంలో నిర్మాణాలన్నీ నిబంధనల ప్రకారమే జరగాలి.. ఇలాంటి మాటలు టౌన్ ప్లానింగ్ అధికారులు తరచుగా బల్లగుద్ది మరీ చెబుతుంటారు. ఈ మధ్య మరో అడుగు ముందుకేసి మరీ సోషల్ మీడియా వేదికల్లోనూ ప్రగల్భాలు పలుకుతూ బాగా ఫేమస్ అవుతున్నారు. వీళ్ల ప్రకటనలు చూస్తే.. నగరంలో నిర్మాణలన్నీ నూటికి నూరు శాతం నిబంధల మేరకే జరుగుతున్నాయనుకుంటే మనం పప్పులో కాలేసినట్లే. ఎందుకంటే, కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పే మాటలకు.. వారు చేసే పనులకు అస్సలు పొంతన ఉండదు. అవినీతి అంటే ఏమిటో తమకు ఏమాత్రం తెలీదని గొప్పలు చెప్పుకునే సదరు అధికారులు.. అక్రమార్జనలో మాస్టర్ డిగ్రీలు పుచ్చుకున్నారు. తొండ ముదిరి ఊసర వెల్లిగా మారినట్లుగా, వీళ్ల అక్రమ వ్యవహారాలు రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అవినీతికి ఆకలెక్కువ అనే మాటను నిజం చేస్తూ.. అక్రమార్జన కోసం కొత్త దారులు సృష్టించుకుంటున్నారు. తాజాగా, నగరంలోని కృష్ణానదీ పరివాహక ప్రాంతాలైన కృష్ణలంక, రామలింగేశ్వరనగర్ ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు కొత్త రకం దందాకు తెరలేపారు. అనధికార అంతస్తులకు ససేమిరా అంటూనే.. అక్రమ నిర్మాణదారులకు కొత్త కిటుకులు నేర్పిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ బాధ్యతలను పక్కనబెట్టి.. అక్రమ నిర్మాణాలకు మధ్యవర్తులుగా అవతారమెత్తారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం లక్ష్య నిర్దేశం చేస్తే.. అందులో ఉన్న లొసుగులను సొమ్ము చేసుకునే పనిలో కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు మునిగి తేలుతున్నారు. అక్రమ నిర్మాణదారులతో అంటకాగుతూ, వారితో అరకొర బాండ్లు కొనిపించి.. అత్తెసరు ప్లానుతో అక్రమ అంతస్తులు నిర్మించుకునేలా దగ్గరుండి అంతా చూసుకుంటున్నారు.

అవినీతి వ్యవహారాలతో ప్రభుత్వ లక్ష్యానికి నిలువునా తూట్లు పొడుస్తున్న లంచగొండి అధికారులు.. ఒక్కో అక్రమ నిర్మాణానికి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. ఇక, కృష్ణలంక, రామలింగేశ్వరనగర్ ప్రాంతాల్లో బిల్డింగ్ ఇన్స్పెక్టరుగా విధుల్లో ఉన్న అధికారి వ్యవహారం మరింత విస్మయం గొలిపేలా ఉంది. అసలు పని తప్ప అన్ని పనులు చూసుకోగలడనే గొప్ప పేరున్న ఈ అధికారి.. సంక్రాంతి సందర్భంగా మరింత చెలరేగిపోయాడు. పండగ ఖర్చులు బాగా ఎక్కువగా వున్నాయేమో..? అక్రమ దందాలు కూడా అదే స్థాయిలో చేసేస్తున్నారు. టీడీఆర్ బాండ్ల పేరుతో ఘరానా మోసం చేయడం.. ఒక్కో బిల్డింగుకు గట్టిగా దండుకోవడం.. మొత్తానికి ఈ సంక్రాంతికి మనోడికి గట్టిగానే గిట్టుబాటయిందని టౌన్ ప్లానింగ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. సదరు బిల్డింగ్ ఇన్స్పెక్టర్ రామలింగేశ్వరనగర్ రఘు రోడ్డులో ఇదే తరహా దొంగ నాటకానికి రంగం సిద్ధం చేశాడు. పునాదుల నుండి ప్లానుకు పూర్తి విరుద్ధంగా అడ్డగోలుగా కట్టిన ఓ భవనంపై అక్రమ అంతస్తు వేసేందుకు ఫీట్లు చేస్తున్నారు. బాండ్లున్నాయంటూ బుకాయిస్తూ.. అలవాటుగా మారిన అవినీతిని నిస్సిగ్గుగా కొనసాగిస్తున్నారు. కృష్ణానదీ తీరంలో అవినీతి వరద పారిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారిపై ప్రజల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణదారులకు చుట్టంలా వ్యవహరిస్తూ.. సామాన్యులను వేధింపులకు గురి చేస్తున్న ఈ తరహా అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నగర పౌరులు ప్రభుత్వ పెద్దలను అభ్యర్థిస్తున్నారు.

## సంస్కృతి సాంప్రదాయాల కలయికే సంక్రాంతి సంబరాలు

### పంచాయతీ కార్యదర్శి బండారు సునీత



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** గ్రామీణ సంస్కృతి సాంప్రదాయాల గౌరవం పెంపొందించే లక్ష్యంతో గ్రామాలలో నిర్వహించే ముందస్తు సంక్రాంతి సంబరాలు ప్రజల్లో ఐక్యమత్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఉంగుటూరు మండలం మానికొండ గ్రామ కార్యదర్శి బండారు సునీత అన్నారు. జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జె అరుణ ఆదేశాలు మేరకు సత్యా సంక్రాంతి గ్రామ స్వచ్ఛతలో మేము సైతం కార్యక్రమంలో భాగంగా మానికొండ పంచాయితీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలలో తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే లా గోమాత పూజలు భోగి మంటలు, పొంగల్ వంటలు, చిన్నారులకు భోగి పళ్ళు పోయటం చెరుకు గడలు అలంకరణ రంగురంగుల ముగ్గులతో పాటు బొమ్మలకు వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వీటితోపాటు హరిదాసుల సంకీర్తనలు గంగిరెద్దుల విన్యాసాలు డోలు, సన్నాయిలతో మాణికొండ గ్రామం నూతన శోభను మరింత పెంచాయి. అంగనవాడి చిన్నారులకు సంస్కృతి విలువలు పెంపొందించేందుకు సంక్రాంతి విశిష్టతను వివరించే విధంగా సాంప్రదాయ ఆటల పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలంతా స్వయం సమృద్ధి వైపు అడుగులు వేయాలని సూచించారు. రంగురంగుల పతాకాలను ఆకాశంలో గ్రామస్తులతో కలిసి ఎగరవేస్తూ సంక్రాంతి విశిష్టతను చాటారు. గ్రామంలోకి కొత్తగా పెళ్లయిన నవదంపతులతో పాటు కొత్త అల్లుళ్లు ఇతర రాష్ట్రాలు దేశాల్లో స్థిరపడి మానికొండకు విచ్చేసిన ఆర్థిక సంపన్నులకు గతంలో ఎన్నడూ లేని విధంగా మన గ్రామం మానికొండ నేనా అని ఆశ్చర్యం కలిగేలా తీర్చిదిద్దిన కార్యదర్శి బండారు సునితను పలువురు ప్రముఖులు అభినందించారు.

## గాలిపటాలు ఎగరేసేటప్పుడు పిల్లలు జాగ్రత్తలు పాటించాలి

### విద్యుత్ శాఖ ఈఈ సుధాకర్

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల (కోడూరు, అవనిగడ్డ, నాగాయలంక)లోని విద్యుత్ వినియోగదారులకు, పిల్లల తల్లిదండ్రులకు ఉయ్యూరు డివిజన్ ఈఈ బీమా వెంకట సుధాకర్ హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిల్లలు గాలిపటాలు ఎగరవేసే సమయంలో ఎలాంటి విద్యుత్ వైర్లకు తగలనివ్వకుండా నిర్మానుష ప్రదేశాలలో గాని, విద్యుత్ వైర్లు తగలని చోటు ఎగురవేయించాలని, అంతేకాక వినియోగదారులు అందరూ భోగభాగ్యాలతో, సంతోషాలతో సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## శివశక్తి ఆధ్వర్యంలో రంగన్నగూడెంలో ఘనంగా ముగ్గుల పోటీలు



**హనుమాన్ జంక్షన్, జనవరి 13, మేజర్ న్యూస్ :** శివశక్తి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకుని గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ రేపటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించబడుతుందని తెలిపారు. తొలి రోజు భోగి పండుగ, రెండవ రోజు సంక్రాంతి, మూడవ రోజు కనుమ పండుగగా సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ముగ్గుల పోటీలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయని ఆయన అన్నారు. చిన్నారులకు భోగి పండుగ రోజు పళ్ళుపోయడం మంచిదని, అలాగే బాలబాలికలకు ఆటలు, పాటలు నిర్వహించి సంక్రాంతి ఉత్సవాలను మరింత ఉత్సాహభరితంగా మార్చాలన్నారు. గ్రామంలో సాంస్కృతిక, ధార్మిక విలువలు పరిరక్షించేందుకు మతమార్పిడులను అరికట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. వారం వారం భజన కార్యక్రమాలు, నెలకు ఒకసారి పౌర్ణమి హారతి, నెలకు ఒకసారి గ్రామ ధార్మిక సభలను నిర్వహించడం ద్వారా సమాజంలో ఐక్యత పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగమణి, ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, ఆళ్ల గోపాలకృష్ణ, శివశక్తి సభ్యులు కొలుసు బలరాం, సునంద, నవులే బాల భవాని తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామస్థుల విశేష పాల్గొనడంతో సంక్రాంతి సంబరాలు ఆనందోత్సాహాలతో కొనసాగాయి.



## చల్లపల్లి రాజావారి కోటలో ముగ్గుల పోటీలు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ప్రాచీన సంప్రదాయ ముగ్గుల పోటీల నిర్వహణ అభినందనీయమని బీజేపీ కృష్ణాజిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్, విశ్వ హిందూపరిషత్ జిల్లా అధ్యక్షులు బూరగడ్డ శ్రీనాథ్ లు అన్నారు. చల్లపల్లి రాజావారి కోటలో శ్రీమంతు రాజా యార్లగడ్డ రామేశ్వర ప్రసాద్ ప్రోత్సాహంతో చల్లపల్లి సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు అడపా రవి ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 35 మంది మహిళలు పాల్గొని చక్కటి రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్, శ్రీనాథ్ ముఖ్య అతిధులుగా పాల్గొని స్థానిక ప్రముకులతో కలిసి విజేతలకు బహుమతులు అందచేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.వై.దాస్, ఈవో పివి. మాధవేం ద్రరావు, కూటమి నేతలు తుంగల గిరి, గాజుల సిద్ధార్థ, వేములపల్లి శ్రీహరి, సూదాని నందగోపాల్, రావి రాజేశ్వరరావు, గోళ్ల ప్రసాద్, ఉరిమి మణికంఠ తదితరులు పాల్గొన్నారు. వాసవీ మహిళా మం డలి ప్రముకులు దేసు జయలక్ష్మి, మాజేటి మల్లీశ్వరి, మాజేటి అమరవాణి, కొల్లిపర నళినిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆలపాటి రాజేశ్వరి, ఉప్పాల గ్రీష్మ, సోమిశెట్టి నాగదేవిలు వేసిన ముగ్గులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

## విస్తరణ సేవలపై సిబ్బందికి శిక్షణ



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాలలో శుక్రవారం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి ఆధ్వర్యంలో, వ్యవసాయ విశ్వ విద్యాలయం అందిస్తున్న విస్తరణ సేవలపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. విస్తరణ శాస్త్రవేత్త డా. నవీన్ నిర్వహించారు. డాక్టర్ డి. సుధారాణి మాట్లాడుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా రైతులకు అందించబడుతున్న విస్తరణ సేవలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు కూడా విస్తరణ సేవల అమ లులో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ, ఈ సేవలపై రైతులకు సమ ర్థవంతంగా అవగాహన కల్పించే విధంగా విస్తరణ సిబ్బంది పనిచేయాలని సూచించారు. అదేవిధంగా, వికసిత్ భారత్ గ్రామీణ ఉపాధి జీవనోపాధి హామీ బిల్లు 2025 అవగాహన కార్యక్రమం భాగంగా, దాని ముఖ్య ఉద్దే శాలు లక్ష్యాలను వివరించారు. అనంతరం విస్తరణ శాస్త్రవేత్త డా. నవీన్ మాట్లాడుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం అందిస్తున్న విస్తరణ సేవలను సమగ్రంగా వివరించి, సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి రైతులకు ఈ సేవలను సమర్థవంతంగా చేరవేయాలని సూచించారు. ప్రోగ్రాం కోఆర్డి నేటర్ డాక్టర్ డి. సుధారాణి, విస్తరణ శాస్త్రవేత్త డా. నవీన్, కోరమాండల్ జోనల్ ట్రైనీ అధికారి డా. అనిల్, గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య మంగళవారం సాయంత్రం విజయవాడ నుంచి కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాకారులతో కొల్లేరు సరస్సు పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు.కొల్లేరు సరస్సు పరిరక్షణలో భాగంగా కాలుష్యాన్ని అరికట్టడం, నీటి నాణ్యతను మెరుగుపరచడం, సిల్టేషన్ నివారణ, జీవవైవిధ్యాన్ని కాపాడడం వంటి అంశాలపై ఛైర్మన్ చర్చించారు. కలెక్టర్‌తో పాటు వీడియోకాన్ఫరెన్స్‌లో కైకలూరు వైల్డ్ లైఫ్ మేనేజ్మెంట్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కేవీ రామ లింగాచార్యులు, గుడివాడ డి ఎల్ పి ఓ జి సంపత్ కుమారి పాల్గొన్నారు.

# ఘంటసాల ప్రజాదర్బార్‌లో అర్జీలు సమర్పిస్తున్న అర్జీదారులు



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** వివిధ సమస్యలు పరిష్కరించా లని కోరుతూ ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ నిర్వహించిన ప్రజాదర్బార్లో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు శుక్రవారం అర్జీలు సమర్పించారు. ఘంటసాల లో తాగునీటి సమస్య ఉందని, నిరుపయోగంగా ఉన్న చెరువును అభివృద్ధి చేసి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ జనసేన నేత యార్ల శ్రీకాంత్ అర్జీ సమర్పించారు. తెలుగురావుపాలెం గ్రా మంలో ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించాలని కోరుతూ గత ఏడేళ్లుగా ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్న సమస్య పరిష్కారం కావడం లేదని సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు ఎమ్మెల్యేకు విన్నవించారు. తాడేపల్లి మెయిన్ స్కూల్ అభివృద్ధి చేయాలను కోరుతూ టిడిపి నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్, ఉప సర్పంచ్ లక్ష్మణ్ అర్జీ సమర్పించారు. దేవరకోట నుంచి చిట్టూర్పు వెళ్లే డొంక రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ రైతు వేమూరి రత్నగిరి అర్జీ సమర్పించారు. శ్రీకాకుళం శివారు సూరపనేని పాలెంలో ఎంపీపీ స్కూల్ ప్రహరీ గోడ నిర్మించాలని కోరుతూ హెచ్ఎం బొకినాల కృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తో కలిసి సమర్పించారు. ఈ ప్రజా దర్బార్‌లో మొత్తం అర్జీలు 47 వచ్చాయని స్థానిక ఎంపీడీవో డి సుబ్బారావు తెలిపారు. తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట కనకదుర్గ, డిసి చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న) అచ్చంపాలెం సర్పం చ్ గాజులు శ్రీనివాసరావు, తహసిల్దార్ బి.విజయ ప్రసాద్, ఎస్సై కె.ప్రతాప్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటింటి జనాభా లెక్కల సేకరణ చేపట్టాలి






మచిలీపట్నం మేజర్ న్యూస్ : వచ్చే ఏప్రిల్ మాసం నుండి 30 రోజులపాటు ఇంటింటి జనాభా లెక్కల సేకరణ చేపట్టాలని కేంద్ర జనాభా లెక్కల సేకరణ డైరెక్టర్ జే నివాస్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ఉదయం మంగళవారం ఉదయం ఆయన న్యూఢిల్లీ నుండి రాష్ట్ర సచివాలయంలోని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, జిల్లాల ప్రధాన జనాభా లెక్కల అధికారులైన జిల్లా కలెక్టర్లతో జనాభా లెక్కల సేకరణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జె నివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనాభా లెక్కల సేకరణ 2027 కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టవలసి ఉంద న్నారు. ఇందుకోసం ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 6 ను జారీ చేసిం దన్నారు. ఇందులో భాగంగా డిజిటల్ జనాభా లెక్కల వివరాల సేకరణ, నిర్వ హణ, పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. సొంతంగా కూడా జనాభా వివ రాలను నమోదు చేసుకోవచ్చన్నారు. ఈసారి జనాభా లెక్కల తో పాటు కుల గణన కూడా చేపట్టాల్సి ఉందన్నారు. ఈ జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ మొదటి దశలో ఈ ఏడాది ఏప్రిల్ మాసం నుండి నెల రోజులు పాటు ఇంటిం టికి తిరిగి వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు.అంతకు 15 రోజులు ముందుగా సొంతంగా కూడా జనాభా వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. రెండవ దశలో వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 9 నుండి 28 వ తేదీ వరకు జనాభా లెక్క ల సేకరణ చేయవలసి ఉంటుందన్నారు. జనాభా లెక్కల సేకరణలో జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు పూర్తి బాధ్యత వహించి పర్యవేక్షించాలన్నారు. జనాభా లెక్కల సేకరణ కోసం 700 నుంచి 800 మంది జనాభాకు ఒక ఎన్యూమరేటర్ను నియమించుకోవాలన్నారు. నోటిఫై చేయబడిన, గుర్తించ బడిన మురికివాడలలో కూడా ప్రత్యేకించి జనాభా లెక్కల సేకరణ చేయాల న్నారు. సంయుక్త కలెక్టర్ అదనపు జనాభా లెక్కల సేకరణ అధికారిగా, డిఆ ర్ఓ జిల్లా జనాభా లెక్కల అధికారిగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కలెక్టరేట్లోని ఎన్ఐసి నుండి పాల్గొని మాట్లాడుతూ యూపీఐ చెల్లింపుల కోసం ప్రత్యేకంగా పిఎఫ్ఎంఎస్ లాగిన్ అవసరం ఉంటుందని అది ఇవ్వాలని కోరగా వెంటనే వారు స్పందించి ఇస్తామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా నుంచి కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, మచిలీపట్నం సహాయ మున్సిపల్ కమిషనర్ గోపాల్ రావు, సిపిఓ కార్యాలయం ఏఎస్ఓ పద్మజ, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీనివాసు, ఎన్ఐసి అధికారి ఫణి కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేడు ఒంగోలు జాతి వృషభ రాజముల బండలాగుడు ప్రదర్శన




**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల మహాత్మాగాంధీ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలలో మన ఊరు - మన సంక్రాంతి సంబ రాల్లో భాగంగా డాక్టర్ గొర్రెపాటి నవనీతి కృష్ణ మెమోరియల్ వారి ఆధ్వర్యం లో 14, 15, 16, తేదీలలో రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బం డలాగుడు ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఘంటసాల పిఏసిఎస్ చైర్ పర్సన్ బండి పరాత్పరరావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 14న 6 పళ్ళ వభాగం, 15న న్యూ కేటగిరి విభాగం, 16 రెండు పళ్ళ విభాగం ప్రదర్శనలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రదర్శనలు విజేతలకు రెండు పళ్ళ విభాగంలో 1 వ బహుమతి 50,000, 2 వ బహుమతి 40, 000, మూడో బహుమతి 30,000 నాలుగో బహుమతి 20, 000 5 వ బహుమతి 10000 గానూ... న్యూ కేటగిరీలో 1 వ బహుమతి 60, 000 2 వ బహుమతి 50,000 మూడో బహుమతి 40 వేలు నాలుగో బహుమతి 30, 000 ఐదవ బహుమతి 20,

**ఘంటసాలలో మన ఊరు - మన సంక్రాంతి సంబరాలు**

**14న ఒంగోలు జాతి ఆవుల అందాల పోటీలు...**

000 ఆరో బహుమతి 15, వేలు ఏడవ బహుమతి 10000 గాను,,, రెండు పళ్ళ విభాగంలో ఒకటో బహుమతి 25000 రెండో బహుమతి 20000 మూడో బహుమతి 15000 నాలుగో బహుమతి 10000 ఐదో బహుమతి 8000 ఆరో బహుమతి 5000 గాను 14 న ఒంగోలు జాతి అందాల పోటీలు లో గెలుపొందిన వారికి 1వ బహుమతి 5000, రెండో బహుమతి 3000, మూడో బహుమతి 2000, నాలుగో బహుమతి 2 దాణ కట్టలు, ఐదవ బహుమతి 1 దాణ కట్ట నిర్ణయించడం జరిగిందన్నారు.. ఈ ప్రదర్శనలు గురించి పూర్తి వివరాలు కొరకు వేమూరి రాజేంద్రప్రసాద్ ఫోన్ నెంబర్ 9912430945, దోనేపూడి రవిశంకర్ 9490333880, కన్నెగంటి లక్ష్మీనారాయణ 9494319062 లను సంప్రదించాలన్నారు. అ.లాగే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, ప్రవాస ఆంధ్రులు గొర్రెపాటి రంగనాథబాబు, తెదేపా మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, డిసి చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, తెదేపా సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, గ్రామ ప్రముఖులు గొర్రెపాటి వెంకట నరసింహారావు, అయినపూడి సన్నీ, గ్రామ ప్రముఖులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## ఉడుముల బుజ్జి తండ్రి అంతిమ యాత్రలో పాల్గొని పాడేమోసిన ఇంచార్జ్ బండి రామకృష్ణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్** : జనసేన పార్టీ నాయకులు ఉడుముల బుజ్జి తండ్రి ఉడు ముల వెంకటరత్నం మంగ ళవారం శారదా నగర్ లోని వారి స్వగృహంలో ఉదయం కాల ధర్మం చెందినారు. అంతిమ యాత్రలో పాల్గొన్న జనసేన పార్టీ ఇంచార్జ్ బం డి రామకృష్ణ,జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు డివిజన్ ఇన్చార్జులు జనసేన పార్టీ నాయకులు ఉడుముల బుజ్జి కుటుంబ సభ్యులు స్నేహితులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

## మన కోసం మనం ట్రస్ట్కు రూ.10వేల విరాళం



**చల్లపల్లి,మేజర్ న్యూస్ :** స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనలో భాగంగా అభి వృద్ధి, సుందరీకరణ పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్ట్కు స్వచ్ఛ కార్యకర్త మల్లంపాటి ప్రేమానందం రూ.10వేల విరాళం అందచేశారు. 3712వ రోజు స్వచ్ఛ సేవలో పాల్గొని కార్యకర్తలతో కలిసి ఉత్సాహం గా స్వచ్ఛసేవలు అందించారు. అనంతరం రూ. 10వేల చెక్కును స్వచ్ఛ చల్లప ల్లి సారథి డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో స ర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ సారథి డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యవసరాల పంపిణీ



**గూడూరు, పెడన మేజర్ న్యూస్ :** చేనేత కళాకారులకు స్ఫూర్తి ఫౌండేషన్ సంక్రాంతి పండుగ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న, వృద్ధ, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న 50 కుటుంబాల సభ్యులు లకు 25కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను కలనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అందించామని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పేరిశెట్టి నాగరవి తెలిపారు. ఈసందర్భంగా నాగరవి మాట్లాడుతూ నిరుపేద చేనేత కళాకారులను అక్కున చేర్చుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివని వీటిని జాగ్రత్తగా ఉపయోగించుకుని స్వాంతన పొందాలని దాతల స్ఫూర్తిని తెలియజేస్తూ ఫౌండేషన్ వారికి కప్పలదొడ్డి గ్రామ ప్రజలతరపున ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆకులమన్నాడు గ్రామ సర్పంచ్ రఫీ, గూడూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సత్యనారాయణ, బూసం లోకనాథం, రఫీ,యసైలు సత్యనారాయణ, సత్యప్రకాష్, ఆదివిష్ణు,రమేష్,గోపి,రాము, చేనేత కళాకారులు పాల్గొన్నారు.


**ఇంటి పేరు మార్పు/సవరణ**

నేను వి.జగదేశ్వరరాజు నివాసం డోర్ నెం : 1-278, చోరంపూడి, బంటుమిల్లి మండలం, కృష్ణాజిల్లా. ప్రస్తుతం నా యొక్క ఆధార్‌లో నా పేరు VALLABU JAGADESWARA RAJU అని నమోదు కాబడినది. ఇప్పుడు ఇంటి పేరు మార్పు/సవరణ చేయగా VALLABHU JAGADESWARA RAJUగా మార్పు చేయుట జరుగుతుంది. నేటి నుండి నాపేరు VALLABHU JAGADESWARA RAJUగా పిలువబడను. ఆధార్‌లో మార్పు కొరకు..

**Notice**

I SHANTA MANI (Old Name), W/o. PREMANANDA RATNAKUMAR, resident of 23-58, NSN Dwaraka Apt, Ballemvari St, Prasadampadu, Vijayawada Rural, NTR district, Andhra Pradesh - 521108. I have changed my name as SANTHI MANI (New Name), W/o PREMANANDA RATNA KUMAR, Hereafter my name is known as SANTHIMANI (New Name), W/o PREMANANDA RATNAKUMAR.

## జుజ్జవరంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహణ



**పామర్రు మేజర్ న్యూస్ :** సంక్రాంతి సంబరాలలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని జుజ్జవరం గ్రామంలో సింజెంట కంపెనీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటిలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మ జన్ను శోభన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగువారి పండుగలలో అతి పెద్ద పండుగ సంక్రాంతి పండుగ విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామప్రజలకు, మహిళలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ముగ్గులపోటీలలో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జుజ్జవరం పిఏసిఎస్ అధ్యక్షులు జోగి గంటలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పసుపులేటి లక్ష్మీనాంచారమ్మ గ్రామప్రజలు, రైతుసోదరులు, మహిళలు పాల్గొన్నారు.

## చెత్తకుప్పల రహిత పంచాయతీగా ప్రకటించిన చోరగుడి...



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చోరగుడి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టి గ్రామాన్ని చెత్తకుప్పల రహిత గ్రామంగా ప్రకటించారు. పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గ్రామంలో చెత్త కుప్పలు లేకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగిందని గ్రామ సర్పంచ్ కందిమళ్ళ పూర్ణకుమారి తెలిపారు. అలాగే సంక్రాంతి సంధర్భముగా కార్యాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి ఐ లవ్ చోరగుడి స్వీయ చిత్ర వేదిక (సెల్ఫీ పాయింట్) ఏర్పాటు చేశారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లలో విధ్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం, వకృత్వం, రంగవల్లుల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అంతేకాక స్వచ్ఛ సంక్రాంతి సందర్భంగా గ్రామంలో రోడ్లన్నీ శుభ్రం చేసి ప్రధాన రహదారులు అన్నీ కొత్త ఎల్ఈడి దీపాలను ఏర్పాటు చేసి గ్రామాన్ని సుందరంగా తయారు చేసారు. ఈ కార్యక్రమాలలో గ్రామ సర్పంచ్ శ్రీమతి కందిమళ్ళ పూర్ణకుమారితో పాటు పంచాయతీ కార్యదర్శి వి.ప్రభుకుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు కందిమళ్ళ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.



## రీ సర్వేలో తప్పులు ఉంటే సంప్రదించండి



**కృత్తివెన్ను జనవరి 13 మేజర్ న్యూస్ :** రీ సర్వే అనంతరం రైతులు తమ భూముల వివరాల కోసం ఎల్పీఎం నెంబర్ ఉపయోగించు కోవాలని తాహసిల్దార్ శశికుమార్ అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం రీ సర్వే అనంతరం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ లక్ష్మీపురం రెవెన్యూ గ్రామంలో రీ సర్వే పూర్తయిందని రైతులకు వివరించారు. రీ సర్వేలు నమోదైన భూముల వివరాలను రైతులకు ఈ సదస్సులో వివరించారు. రీ సర్వేలో ఏమైనా తప్పులు దొర్లితే రైతులు సరిచేసుకోవచ్చునన్నారు. రీ సర్వే వివరాలు గ్రామ సచివాలయం లోనూ, గ్రామ విఆర్వో దగ్గర అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు పరిశీలించుకుని ఏమైనా తప్పులు ఉంటే అర్జీలు ద్వారా స్థానిక రెవిన్యూ అధికారులకు తెలియపరచాలన్నారు. అలాగే లక్ష్మీపురం గ్రామంలో పండుగ పేరుతో కోడిపందాలు, జూదాలు లాంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక సర్పంచ్ పులగం సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీపాదం శ్రీనివాసరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జక్కంపూడి, షాబాద్ గ్రామంలో మకర జ్యోతి దర్శన ఆహ్వానం

**భారతదేశంలోనే శబరిమలై తరువాత మకరజ్యోతి దర్శనం జరిగే 2వ అతిపెద్ద దేవస్థానం...**





**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** ప్రతి ఏడాది మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప స్వామి ప్రధాన ఆలయం కేరళా రాష్ట్రంలోని భక్తులకు కనువిందు చేసే స్వామి వారి మకర జ్యోతి దర్శనం విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి, షాబాద గ్రామంలో వేంచేసియున్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవస్థానాని కి ఎదురు గా ఉన్న అభయ ఆంజనేయ స్వామి కొండ పైన బుధవారం సాయంత్రం మకర జ్యోతి దర్శనం కానున్నట్లు ఆ ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మన హిమా వెంకట శివ ప్రసాద్ తెలిపారు..మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఉన్న అయ్యప్ప ఆలయాలు ఉన్నాయి. కానీ ఈ గ్రామంలో నీ ఈ అయ్యప్ప ఆలయంను కేరళ శబరిమల ఆలయ నమూనాతో నిర్మించినట్లు చెప్పారు. తమ దేవాలయంలో కేరళ సాంప్రదాయాలతో మాస పూజలు, స్వామివారి నిత్యాభిషేకాలు వంటి క్రతువులు నిర్వహిస్తామన్నారు. శబరిమలై మకర జ్యోతి దర్శనం సందర్భంగా బుధవారం సాయంత్రం 6:45 నిమిషాలకు శబరిమలైలో ఏ విధంగా పొన్నాంబులమేడులో జ్యోతి దర్శనం ఇస్తుందో అదే విధంగా తమ ఆలయానికి ఎదురుగా ఉన్న అభయ ఆంజనేయ పర్వతంపై జ్యోతిని వెలిగిస్తామని ఆలయ చైర్మన్ ప్రసాద్ తెలిపారు.. కేరళ రాష్ట్రంలో జరిగే శబరిమలై ఆలయానికి వెళ్ళలేని భక్తులు వృద్ధులు మహిళలు తమ ఆలయంలో జరిగే మకరజ్యోతి దర్శనానికి పెద్ద ఎత్తున హాజరు అవ్వాలని ఆయన కోరారు... ప్రతి ఏడాది ఆలయంలో మకర జ్యోతి దర్శనం నిర్వహిస్తున్నామని అంతేగాక మకరజ్యోతి దర్శనానికి ముందు ఉదయం నుండి ద్రవ్యా భిషేకం సాయంత్రం ఐదు గంటల నుండి పూలాభిషేకం స్వామివారి మూలవిరాట్ కు నిర్వహించి అనంతరం 6:40 నుంచి 6:45 నిమిషాల వరకు మకర జ్యోతి దర్శనం కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి టీ.వీ.ఎస్. మల్లేశ్వర రావు స్వామి తెలిపారు.. మకర జ్యోతి దర్శనం అనంతరం వచ్చిన భక్తులందరికీ స్వామి వారి ప్రసాదాల వితరణ కార్యక్రమాలు చేపట్టనున్నామని ఆయన వివరించారు.ఈ సందర్భంగా దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కట్టుదిట్టమైన భద్రత పోలీస్ అధికారులు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హిమ వెంకట శివప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎడ్ల సాంబశివరావు, కోశాధికారి టీవీఎస్ మల్లేశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షుడు మేడూరు నరేంద్ర, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అయోధ్య రామ మందిరం నమూనాను దర్శించుకున్న అంబికా కృష్ణ, దూండీ రాకేష్

**నమూనా అత్యద్భుతంగా ఉందంటూ కితాబు**





**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** అయోధ్య రామ మందిరం నమూనాను ప్రముఖ సినీ నిర్మాత మాజీ శాసనసభ్యులు అంబికా కృష్ణ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ దూండీ రాకేష్ దర్శించుకున్నారు. అయోధ్య రామ మందిరం నమూనా అత్యద్భుతంగా ఉందని బలరాముని దర్శించుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా అంబికా కృష్ణ పేర్కొన్నారు. భవానిపురం బబ్బురి గ్రౌండ్స్ లో నిర్వహిస్తున్న అయోధ్య రామ మందిరం నమూనా ఎగ్జిబిషన్ను ప్రముఖ పారిశ్రామికవేత్త మాజీ శాసనసభ్యులు అంబికా కృష్ణ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ దర్శించుకున్నారు. రామ మందిరం నమూనా ఎలా తయారు చేశారు, తయారు చేయడానికి ఎంత సమయం పట్టింది, ఎంతమంది పనిచేశారనే వివరాలను ఎగ్జిబిషన్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బలరాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అంబికా కృష్ణ,దూండీ రాకేష్ మాట్లాడుతూ దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన అయోధ్య రామ మందిరం నమూనాను విజయవాడ నగర ప్రజల కోసం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నమూనా అత్యద్భుతంగా ఉందని ప్రజలందరూ అయోధ్య రాముని దర్శించుకునేందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు కార్తికేయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం బీచ్‌కి నూతన ఊపు 'మసులా బే పార్క్ కమిటీతో అభివృద్ధి దిశగా అడుగు

**బీచ్ అందం అభివృద్ధి లక్ష్యంగా కమిటీ ఏర్పాటు**

**11 మంది నిపుణులు కొత్త బృందంలో భాగస్వామ్యం**

**రాజకీయాలకు అతీతంగా ప్రజా భాగస్వామ్యంతో అభివృద్ధి**





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా మచిలీపట్నం బీచ్ పర్యాటకంగా రూపుదిద్దుకునే దిశగా పెద్ద అడుగు పడింది. బీచ్ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని 'మసులా బే పార్క్ కమిటీ' ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కమిటీ తొలి సమావేశం మంగళవారం మచిలీపట్నంలోని డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య భవనంలో ఘనంగా జరిగింది. కమిటీకి అధ్యక్షుడిగా నియమితులైన గొర్రెపాటి శ్రీనివాస్ చందు అధ్యక్షతన సమావేశం జరగగా,కమిటీ కొత్త సభ్యులను అధికారికంగా పరిచయం చేశారు. చందు మాట్లాడుతూ, మచిలీపట్నం బీచ్‌తోపాటు పట్టణం మొత్తం సర్వతోముఖంగా అభివృద్ధి చెందడమే కమిటీ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. చందు మాట్లాడుతూ,బీచ్ అభివృద్ధి ప్రణాళికల్లో శుభ్రత, లైటింగ్, పార్కులు,ఆహార కేంద్రాలు,సాంస్కృతిక వేదికలు వంటి అంశాలను అమలు చేస్తామని చెప్పారు. మచిలీపట్నం పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో నిపుణులైన 11 మందిని కమిటీలో సభ్యులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కమిటీలో వైస్ ప్రెసిడెంట్‌గా యార్లగడ్డ శివరామ ప్రసాద్, జనరల్ సెక్రటరీగా నడుకుదిటి నిఖిత, ట్రెజరర్‌గా గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు బాధ్యతలు స్వీకరించారు. మిగతా సభ్యులు వీసీ మెంబర్లుగా కొనసాగుతారని తెలిపారు.

ఇప్పటికే మచిలీపట్నం బీచ్ అభివృద్ధి అవకాశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉన్నామని, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి చర్యలు చేపట్టనున్నామని చందు తెలిపారు. స్థానిక వ్యాపారులు, యువత, సేవా సంస్థల సహకారంతో మచిలీపట్నం ఒక మోడల్ టూరిస్టు సెంటర్‌గా ఎదగడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. తొలి సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు మా అందరి లక్ష్యం మచిలీపట్నం అభివృద్ధే.బీచ్ పర్యాటకంగా వెలుగొందాలి అని ఏకమత్యంతో ప్రకటించారు.

# బుద్ధవరంలో అంబరాన్నంటిన ముందస్తు సంక్రాంతి సంబరాలు





**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిన్నారులకు డిపిఓ అరుణ భోగి పండ్లు పోసే కార్యక్రమం**

**ప్రభుత్వ ఆధ్వర్యంలో అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు**

**ముఖ్యఅతిథిగా హాజరైన డిపిఓ డాక్టర్ అరుణ**

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఘనంగా ముందస్తుసంక్రాంతి సంబరాలు కృష్ణమ్మ తీరంలో జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జె.అరుణ సారధ్యంలో ముందస్తు సం'క్రాంతి' వేడుకలు మొదలైన పండగ సంబరాలు తో పులకిస్తున్న కృష్ణ తీరం గన్నవరం మండల పరిధిలోని బుద్ధవరంలో రాష్ట్ర పంచాయతీ శాఖ మాత్యులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పి.ఆర్.కమిషనర్ కృష్ణ తేజ ఆదేశాలకు అనుగుణంగా,జిల్లా పంచాయతీ అధికారిని డాక్టర్ జె.అరుణ సారధ్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం మండల పరిషత్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీలు, రంగవల్లులు,ఫెస్టివల్ విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు, తిలకించేందుకు కళాకారులు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.బుద్దవరం గ్రామంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ సంక్రాంతి ముందస్తు సంక్రాంతి వేడుకలు అట్టహాసంగా సాగాయి. తెలుగు లోగిళ్లలో అతిపెద్ద పండగైన సంక్రాంతి కృష్ణమ్మ చెంతకుకు ముందే వచ్చిందన్నట్లు కృష్ణా తీరం పులకించింది.జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేయడంతో గ్రామాలలోసందడి నెలకొంది. గన్నవరం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, సూచనలు సలహాలకు అనుగుణంగా వేడుకలను డిపిఓ అరుణ ప్రారంభించారు. ప్రస్తుత యాంత్రిక జీవన విధానంతో నానాటికి కనుమరుగవుతున్న తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను భావిత్తరాలకి అందించే బాధ్యత నేటి తరం తీసుకోవాలని అరుణ పిలుపునిచ్చారు.

**ఆకట్టుకున్న రంగవల్లులు, పోటీలు..** వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వనితలు రంగవల్లులపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 60 ఏళ్ల పైబడిన వారూ పోటీల్లో సత్తా చాటారు. బుద్దవరం ఊరిలోకి వెళ్లే ప్రధాన రహదారి వెంట మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు వివిధ రకాల ముగ్గులతో అలరించారు. ఆకట్టుకునే రీతిలో వివిధ డిజైన్లతో సంస్కృతి ఉట్టిపడేలా రంగవల్లులు తీర్చిదిద్దారు.పోటీలో గెలిచిన వారికి బహుమతులతో పాటు ప్రోత్సాహక నగదును అందించారు.గాలిపటాల పోటీలు సందర్శకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల ప్రజా పరిషత్తు అధికారిణి తుంగల స్వర్ణలత, మండల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సంప్రదాయంసంస్కృతుల సమ్మేళనంగా వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** స్వచ్ఛ కృష్ణా – స్వచ్ఛ గ్రామ పంచాయతీ కార్యక్రమాలు, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పాపవినాశనం గ్రామంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. గ్రామ సచివాలయం రహదారిలో మహిళలు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా పోటీల్లో పాల్గొన్న మహిళలు ముగ్గులు వేశారు. చిన్నారులు సైతం ఈ పోటీల్లో పాల్గొని ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టారు. పండుగ వాతావరణంలో పోటీలు నిర్వహించగా, మొదటి బహుమతి అంగడాల వెంకట జయలక్ష్మి, రెండవ బహుమతి డొక్కు సీతారావమ్మ, మూడవ బహుమతి కలకండ గాయత్రి దక్కించుకున్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు, పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. టీడీపీ నేత తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), గ్రామ సర్పంచ్ కుంపటి అనిత, టీడీపీ నాయకులు కుంపటి చిట్టిబాబు, కార్యదర్శి షేక్ అన్వర్ షరీఫ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## పదోన్నతి పై బదిలీ అయిన పిడిఓలకు సత్కారం

**పెదపారుపూడి మేజర్ న్యూస్:** పదోన్నతితో బదిలీ పొందిన పంచాయతీ అభివృద్ధి అధికారులు దయామణి, ఈశ్వరి కుమారిల సేవలు అభినందనీయమని పెదపారుపూడి ఎంపీడీఓ జె.విమాదేవి పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారుల ఆధ్వర్యంలో పదోన్నతితో ఇటీవల బదిలీపై వెళ్లిన పిడిఓ లకు ఆత్మీయ వీడ్కోలు సత్కారం మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విమాదేవి మాట్లాడుతూ చినపారుపూడి, పెదపారుపూడి పిడిఓ లు ఇద్దరూ తనకు తెలిసిన ఆరు మాసాల కాలంలో చక్కగా పనిచేశారని అన్నారు. ఇద్దరి సేవలు గుర్తించదగినవని పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆత్మీయ సత్కారానికి పూనుకున్న అందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం దయామణి, ఈశ్వరి కుమారిలను దుశ్శాలువాలతో, జ్ఞాపిక లతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓలు వంగా శ్రీనివాస్, పి. పూర్ణ చంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ బేగం, జూనియర్ అసిస్టెంట్ స్వరూప్, పి డి ఓ లు టీవీఎస్ ఆర్ కే ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్, సుబ్రహ్మణ్యం, పుల్లారావు, విజయ్, కిరణ్, కృష్ణవేణి, నాగమణి, హకల్య తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం : డీఎస్పీ విద్యా శ్రీ





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** సాంప్రదాయ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించటం అభినందనీయమని అవనిగడ్డ డి.ఎస్.పి టి విద్యా శ్రీ అన్నారు. మండల పరిధిలోని వేగనూరు గ్రామంలో సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని విశ్వనాధుని శ్రీనివాసులు మెమోరియల్ జడ్పీ హైస్కూల్ ఓనర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం సాయంత్రం డి.ఎస్.పి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా యువత జూద క్రీడల వైపు మరలకుండా సాంప్రదాయ గ్రామీణ క్రీడలైన కబడ్డీ పోటీలను నిర్వహించిన నిర్వాహకులు విశ్వనాధుని వాసుదేవను డి.ఎస్.పి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మి, ఎస్వీఎల్ క్రాంతి కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, బిజెపి నాయకులు జీవి నగరాయులు భోగాది చంద్రశేఖర్ ఉపాధ్యాయులు జివిఎస్ పెరుమాళ్ళు తుంగల పాండురంగారావులతో పాటు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ సంక్రాంతి



**విస్సన్నపేట మేజర్ న్యూస్:** స్వచ్ఛ ఆంధ్ర –స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమంలో భాగంగా విసన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలో నూజివీడు రోడ్‌లో గల స్మశాన వాటిక బయట చెత్త వేయకుండా గ్రామపంచాయతీ వారు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో డివిజనల్ అభివృద్ధి అధికారి రమణ, ఎంపీడీవో చిన్న రాట్నలు,తహసిల్దార్ లక్ష్మీ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి శాబాద గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ఈనెల 19 తేదీ నుండి 31వ తేదీ వరకు జక్కంపూడి శాబాద గ్రామంలో నిర్వహిస్తున్నట్లు గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షుడు మేడూరి నరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను కరపత్రాలను మంగళవారం జక్కంపూడి పంచాయతీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశు వైద్య చికిత్సలు, పట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యం పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఈ అవకాశాన్ని పశు పోషకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పార్టీ అధ్యక్షుడు నరేంద్ర తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, పశు వైద్యులు, గ్రామ పాడి రైతులు పంచాయతీ సిబ్బంది సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సింజెంటా ఆధ్వర్యంలో.. రంగవల్లుల పోటీలు, బహుమతులు



**గుడ్లవల్లేరు జనవరి 13 మేజర్ న్యూస్:** సంక్రాంతి సంబరాలలో భాగంగా మంగళవారం మండలంలోని చంద్రాల గ్రామంలో సింజెంటా కంపెనీ వారు స్థానిక మహిళలకు, యువతులకు, బాలికలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పెద్ద యువతులు పాల్గొని రంగురంగుల రంగవల్లులతో అలరించారు. ఈ సందర్భంగా సింజెంటా కంపెనీ బిసినెస్ మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ తెలుగువారి పండగలలో అతి పెద్ద పండగైన సంక్రాంతి పండగ విశిష్టత గురించి వివరించారు.అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలకు, కార్యకర్తలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పోటీలో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతి ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో సింజెంటా కంపెనీ టెర్రటరీ మేనేజర్ ఎం. శ్రీనివాస్, చంద్రాల గ్రామ నాయకులు ఆడుసుమిల్లి రాము, కాలిశెట్టి అర్జునరావు, నిమ్మగడ్డ కుటుంబ రావు, ఆడుసుమిల్లి చిట్టిబాబు, ఎండిఓస్ వి. దుర్గారావు, బి.వరుణ్, వి. ఏడుకొండలు, గ్రామప్రజలు, రైతుసోదరులు, మహిళలు పాల్గొన్నారు.

## స్వర్గీయ మండలి విగ్రహానికి నివాళులర్పించిన మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమకు ఆపన్న హస్తం అందించిన స్వచ్ఛంద సేవాస్ఫూర్తి ప్రదాత ఎంవి కృష్ణారావు అని అవనిగడ్డ మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ అన్నారు. తెలుగు జాతి రత్నం, దివిసీమ పునర్నిర్మాత, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక వంతెన సెంటరులోని ఎంవీ కృష్ణారావు విగ్రహానికి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఎం సి చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు,యాసం చిట్టిబాబు, రాయపూడి వేణుగోపాల్,బాండే రాఘవ, పలువుర కోటమి నాయకులు పాల్గొన్నారు.

# పేదల కళ్ళలో సం'క్రాంతి' వెలుగులు...

## సంక్రాంతి కానుకగా పేదలకు ఇళ్ల పట్టాలు..

## నెరవేరిన నాలుగు దశాబ్దాల పేదల కల...

## అంతులేని ఆనందం...

## తడిబారిన కళ్లతో లబ్దిదారుల హర్షాతిరేకాలు...







**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** భావోద్వేగాలను అదుపు చేసుకోలేని ఒక ఆనందకరమైన పరిస్థితి. నాలుగు దశాబ్దాల కాలంగా నెరవేరని కల నేడు నిజమైంది. నగరంలో మధ్య నియోజకవర్గంలో 58 డివిజన్ ప్రజలకు దశాబ్దాల పాటు ఎటువంటి చట్టబద్ధతలేని స్థలంలో గూడు నిర్మించుకుని నివాసం ఉంటున్న నిరుపేదలకు ఆనందాన్ని పంచే సంక్రాంతి పండుగ ముందే వచ్చింది. నాలుగున్నార దశాబ్దాల తర్వాత ప్రభుత్వ స్థలాల్లో చిన్న చిన్న ఇళ్లను నిర్మించుకొని నివాసం ఉంటున్న 51 మంది పేద నివాసితులకు కూటమి ప్రభుత్వం చట్టబద్ధత కల్పిస్తూ జిఓ నెంబర్ 30 నిబంధనల ప్రకారం ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే నంబరు 24/10బి, 27/1బి లో 86.39 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు 70 కుటుంబాల వారు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి గృహాలు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. ఆక్రమణ స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈ రోజు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ ఆఘమేఘాల మీద అమలులోకి తీసుకు రావడంతో పాటు సంక్రాంతి కానుకగా 51 మంది లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆర్థిక అభివృద్ధిలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టిందని వివరించారు. ఇది పేదల ప్రభుత్వమని, పేదల ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. అణగారిన వర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పి 4 పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను పేద ప్రజలు అందిపుచ్చుకొని తమ తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఇప్పటివరకు శాశ్వతవాసాలు నిర్మించుకోలేని పరిస్థితుల్లో ఉన్న నివాసితులు ఇకముందు ధైర్యంగా తమ శక్తి మేరకు శాశ్వత నివాసాలు నిర్మించుకోవచ్చని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో నందమూరి నగర్ నివాసితులు ఈ ప్రాంత స్థలాలకు పట్టాలు కావాలని కోరిన నేపథ్యంలో అప్పుడు వారికి ఇచ్చిన హామీ నేడు నిజం చేశానన్నారు. నియోజకవర్గంలో ప్రజల మౌలిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం చేపడుతున్న కార్యక్రమాలను, సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే బాధ్యత తనదేనన్నారు. సూపర్సిక్స్ హామీలలో భాగంగా చెప్పిన ప్రతి మాటను అమలు చేస్తున్నామన్నారు. పేద ప్రజల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకొని పనిచేస్తుందన్నారు. ఇకనుంచి నందమూరి నగర్ వాసులు ధైర్యంగా తమ తమ ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకోవచ్చన్నారు. నగరపాలక సంస్థ నుంచి ఇంటి ప్లాన్లు, బ్యాంకుల నుంచి రుణాలు కూడా పొందేందుకు ఈ పట్టాలు ఉపయోగపడతాయన్నారు. పట్టాలు కొందరు లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం వెలకట్టలేనిదన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడు ఎవరికి ఎటువంటి అవసరం వచ్చినా తక్షణం స్పందించేందుకు ఈ ప్రాంతంలో కూడా ఒక కార్యాలయం ఏర్పాటు చేశానన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, ఉత్తర మండలం ఎమ్మార్వో సూర్యా రావు, నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు, మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి, స్థానిక నాయకులు బి. ఆర్. సోమేశ్వరరావు, ఆళ్ళ రామారావు, నవనీతం సాంబశివరావు సహా పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పులిగడ్డ అభివృద్ధే లక్ష్యం : సర్పంచ్ విజయకుమార్



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** పులిగడ్డ పంచాయతీని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం సర్పంచ్ ఆధ్వర్యంలో రోడ్డుకి ఇరువైపులా జెసిబి, ప్రజల తో జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. పులిగడ్డ గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా, గ్రామాన్ని అభివృద్ధి పథంలో ఉంచాలని సర్పంచ్ విజయ్ కోరారు. అదేవిధంగా గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పులిగడ్డ జంక్షన్ దగ్గర నుండి సాయిబాబా గుడి వరకు ఫెన్సింగ్ వేసి దాని పక్కన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చే శ్వరరావు, పంచాయతీ ఈవో బి. అనిత గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న సర్పంచ్, పంచాయతీ పాలకవర్గాన్ని, ఈవో అనితకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# యువత ఆటల పోటీల్లో పాల్గొనడం శుభపరిణామం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని యువత చెడు మార్గాల వైపు వెళ్ళకుండా ఆటల పోటీల్లో పాల్గొనడం శుభ పరిణామం అని ఎమ్మెల్యే తనయుడు,గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రాం అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక గాంధీ క్షేత్రంలో వెంకటరామ్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి షటిల్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ పోటీ లు గ్రామీణ యోజన వికాస సమితి, గాంధీ క్షేత్రం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా, పోటీలను వెంకట్రాం ప్రారంభించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి 32 జట్లు పోటీల్లో పాల్గొనగా ఉత్సాహంగా పోటీలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మతి. శ్రీనివాసరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు య సం. చిట్టిబాబు, డిసి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపురెడ్డి వెంకటస్వామి, జిల్లా కర్ర సాము అసోసియేషన్ చైర్మన్, పిఏసిఎస్ చైర్మన్లు ఎలవర్తి చిన్న, ఎర్రం సెట్ సుబ్బారావు, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, కూటమి నాయకులు గుడివాడ శివరావు, తదితరులు పాల్గొన్నారు.



# ఖాళీ స్థలాల పన్ను బకాయిదారుల స్థలాలలో నోటీసు బోర్డులు ఏర్పాటు

**విజయవాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన**





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఖాళీ స్థలాల పన్ను బకాయిదారుల స్థలాలలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారని విజయవాడ నగరపాలక సంస్థల డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన అన్నారు. మంగళవారం ఉదయం జోజి నగర్, విద్యార్థపురం, వెటర్నరీ కాలనీ, కండ్రిక, క్రీస్తు రాజు పురం ప్రాంతాలలో ఖాళీ స్థలాల పన్ను బకాయిదారుల స్థలాలలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) జి. సృజన మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థ మూడు సర్కిల్స్ పరిధిలో గల ఖాళీ స్థలము పన్ను చెల్లించకుండా వున్న పన్ను బకాయి దారులను గుర్తించి, క్షేత్ర స్థాయిలో వారి ఖాళీ స్థలములలో నోటీసు బోర్డులను ఏర్పాటు చేసి నోటీసులు జారీ చేశారు. అందులో భాగంగా 09-01-2026 నుండి ఇప్పటి వరకు సుమారు 50 నోటీసు బోర్డులు వరకు ఏర్పాటు చేశారని, కావున విజయవాడ నగర ప్రజలు నగర పాలక సంస్థ వారికి సహకరించి వెంటనే వారి యొక్క ఖాళీ స్థలములపై గల పన్ను బకాయిలను వెంటనే చెల్లించవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఏ యు బి శర్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





# సమర్థవంతంగా జన గణనకు సన్నద్ధత




## మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో సమర్థవంతంగా జన గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం అమరావతి నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (జీఏడీ & ఏఆర్) ఎస్.ఎస్.రావత్.. అన్ని జిల్లాల కలెక్టర్లతో జనగణన కార్యక్రమాల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెన్సస్ రెండు దశల్లో జరగనున్న నేపథ్యంలో హౌస్ లిస్టింగ్, హౌస్ టు హౌస్ సర్వేల నిర్వహణ సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. జనగణనకు సంబంధించి రాష్ట్ర, జిల్లా, సబ్ డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారుల నియామకంపై ఇప్పటికే ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో ఆయా అధికారుల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తొలిసారిగా డిజిటల్ విధానంలో సెన్సస్ జరగనున్న నేపథ్యంలో అత్యంత పారదర్శకంగా జన గణనకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రత్యేక ప్రణాళికలతో సరైన కార్యాచరణ ద్వారా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ముఖ్య జన గణన అధికారిగా కలెక్టర్, అదనపు ముఖ్య జన గణన అధికారిగా జాయింట్ కలెక్టర్, జిల్లా జన గణన అధికారిగా డీఆర్వో వ్యవహరించనున్న నేపథ్యంలో ఆ అధికారుల స్థాయిలో తీసుకోవాల్సిన స్పష్టతతో ముందడుగు వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

# గ్రామాలు సంక్రాంతి శోభతో విలసిల్లాలి

**అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

**మాచవరంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు**

**ఘనంగా మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు**

**రెడ్డౌతు కృష్ణబాబు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు**

**నిరుపేదలకు బియ్యం సహాయం**

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గ్రామాలు సంక్రాంతి శోభతో విలసిల్లాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. సోమవారం రాత్రి కోడూరు మండలం మాచవరంలో స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల సందర్భంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. జనసేన పార్టీ నాయకులు రెడ్డౌతు కృష్ణబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆత్మీయ అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు నిర్వాహకులతో కలిసి సభా వేదికపై ఎంవీ కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఇంటిల్లిపాదీ మహిళలు, పిల్లలు పిండివంటలతో సంతోషంగా జరుపుకునే సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో నవ క్రాంతులు, నూతన కాంతులు వెదజల్లాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయ కులు, కార్యకర్తలు సంక్రాంతి సందర్భంగా గ్రామగ్రామాన ముగ్గుల పోటీలు, షటిల్ పోటీలు, వంటల పోటీలు నిర్వహించి ప్రజలందరినీ భాగస్వాములను చేయటం అభినందనీయం అన్నారు. ఈ గ్రామంలో సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలు భారీ ఎత్తున నిర్వహించటంతో పాటు, పేదలకు సహాయ కార్యక్రమం నిర్వహించిన రెడ్డౌతు కృష్ణబాబును ఎమ్మెల్యే అభినందించారు. రాజకీయాలను సమాజ సేవ కోసం వినియోగించి, ఆర్తజనులను ఆదుకుంటూ, కష్టాల్లో ఉన్న వారికి అన్న, వస్త్రాలు, నీడ అందించి అండగా నిలవాలనే సమున్నత ఆశయంతో సేవ చేసి దివిసీమ పునర్నిర్మాతగా, ఆర్త జన బంధువుగా ఖ్యాతి గడించిన మండలి వెంకట కృష్ణారావు స్ఫూర్తితో నేటి యువనాయకులు ముందుకు సాగి ప్రజల అభిమానం చూరగొనాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల విజేతలకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, చైర్మన్ చిలకలపూడి పాపారావు చేతులమీదుగా రెడ్డౌతు కృష్ణబాబు ఆధ్వర్యంలో బహుమతులు అందచేశారు. మొదటి బహుమతి విజేత రెడ్డౌతు తిరుపతమ్మకు ఎల్ఈడీ టీవీ, రెండవ బహుమతి విజేత కూరాకుల ప్రణీతకు మిక్సీ, మూడవ బహుమతి విజేత సంబారు పద్మజకు గ్రైండర్, పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ 150మందికి కుక్కర్లు అందచేశారు. ముందుగా ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కుమార్తె శీలం కృష్ణప్రభ, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ సతీమణి మండలి సాయి సుప్రియ సందర్శించి మహిళ లను అభినందించారు. మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు నియోజ కవర్గం నలుమూలల నుంచి 350మందికి పైగా తరలివచ్చి అద్భుతమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. బహుమతి ప్రదానోత్సవం అనంతరం సభా వేదికపై అతిథులను రెడ్డౌతు కృష్ణబాబు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు కూరాకుల చంద్రశేఖర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, గుడివాక శివరావు, సింహాద్రి పవన్, బండ్రెడ్డి హరి, కొల్లి వెంకటేశ్వరరావు (చినబాబు), పార్టీ మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ మర్రె గంగయ్య, సొసైటీ చైర్మన్లు పూత బోయిన కరుణకుమార్, కోట సుబ్బారావు, సర్పంచులు కనగాల వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి శ్రీదుర్గ, దామోదర్, కోడూరు టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, కూటమి నాయకులు తోట రాంబాబు, జరుగు పోతురాజు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, రామారావు, వెంకటేష్, లోలా క్షుడు, యలవర్తి ఆది, టీడీపీ గ్రామ అధ్యక్షులు కూరాకుల శివప్రసాద్, శివ య్య, పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు










## ఇప్పటి వరకు 28,000 ఉచిత పండ్ల, పూల మొక్కల పంపిణీ చేసాం



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటివరకు 28 వేల మొక్కలను పంపిణీ చేశామని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకల్పిస్తున్న హరిత ఆంధ్ర ప్రదేశ్ లో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ చేస్తున్న ఉచిత పండ్ల, పూల మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఇప్పటివరకు 28 వేల మొక్కలను పంపిణీ చేశామని అన్నారు. అందులో మామిడి 6000, జామ 6000, నిమ్మ 6000, నూరువరహాలు 10,000 పంపిణీ చేశామని, సంక్రాంతి పండుగ తర్వాత గులాబీ, మందార మొక్కలను కూడా ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఉచిత పండ్ల, పూల మొక్కల పంపిణీ కార్యక్రమం ద్వారా నగర కాలుష్యాన్ని తగ్గించే దిశగా విజయవాడ నగరపాలక సంస్థ పని చేస్తుందని ప్రజలందరూ దీనిలో భారీగా పాల్గొని వారు కూడా కాలుష్యాన్ని తగ్గించే ఈ కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

## మంగళాపురంలో పారిశుధ్య కార్మికులకు వస్త్రదానం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మంగళాపురంలో పారిశుధ్య కార్మికులకు వస్త్ర దానం చేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు నూతన దుస్తులను అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐక్యంగా ఉంటే సమస్యలన్నీ పరిష్కారమవుతాయి

### తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై వి బి రాజేంద్ర ప్రసాద్



**ఉయ్యూరు మేజర్ న్యూస్ :** ది ఉయ్యూరు ఆల్ ఆటోమోటివ్ టైర్స్ &బ్యాటరీస్ షాప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఈ రోజు మాజీ ఎమ్మెల్సీ వై వి బి రాజేంద్ర ప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపారంగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమస్యలను రాజేంద్ర ప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ఏ వ్యవస్థ అయినా సంఘం అయిన ఐక్యంగా ఉంటేనే వారి యొక్క సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. వ్యాపారపరంగా ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులను రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు. రాజేంద్ర ప్రసాద్‌ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపన శ్రీనివాస్, సయ్యద్ అజ్మతుల్లా,డి. ఉయ్యూరు ఆల్ ఆటోమోటివ్ టైర్స్& బ్యాటరీస్ షాప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఫజులుల్ మజీద్,కార్యదర్శి అబ్దుల్ మాబూద్, ట్రెజరర్ ప్రసాద్,ఉపాధ్యక్షులు వెంకట రామన్, జాయింట్ సెక్రెటరీ అబ్దుల్ గఫూర్, సభ్యులు పాలడుగు రామకృష్ణ, షేక్ రహీమ్, మహమ్మద్ దావూద్, నూరుద్దీన్ పాల్గొన్నారు.



## ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా ప్రజలందరికీ, ప్రజా ప్రతినిధులు, అధి కారులు, పాత్రికేయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, రైతులు పాడి పంటలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించే అచ్చ తెలుగు పండుగ అని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** భోగ భాగ్యాలతో "భోగి" సిరి సంపదలతో "మకర సంక్రాంతి" కనువిందుగా "కనుమ" పండుగను జిల్లా ప్రజలు కుటుంబ సభ్యులు బంధు మిత్రుల తో ఆనందంగా జరుపు కోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరి జీవితాల్లో మకర సంక్రాంతి వెలుగులు నింపాలని, సిరి సంపదలు పాడి పంటలు సుఖ సంతోషాలు తో ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం నింపాలని ఈ ఏడాది అన్ని రంగాలలో అగ్ర భాగాన నిలవాలని ఆకాంక్షిస్తూ. మన సంస్కృతి సంప్రదాయాలకు, రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీక సంక్రాంతి తెలుగులోగిళ్లు శుభాలకు, సుఖసంతోషాలకు నెలవు కావాలని, రైతుల ఇంట ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ శుభాకాంక్షలు తెలిపారు.

## కృష్ణాజిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా ప్రజలందరికీ, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుక ప్రజలందరికీ మరింత ఆనందం పంచాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ మన సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతీక అని, ఈ పండుగ అందరిలో స్నేహభావం, సంతోషం, శ్రేయస్సు తీసుకురావాలని, పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని అన్నారు.


19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు **ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999


# సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు







**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు నేతృత్వంలో సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర డి.జి.పి. హరీష్ కుమార్ గుప్తా దంపతులు పాల్గొని రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయ పద్ధతుల్లో పండుగ వేడుకలు నిర్వహించారు. బోగిమంటలు, ధాన్యపు రాసులు, హరిదాసులకు ధాన్యపు రాసుల అందజేతతో పాటు గ్రామీణ వాతావరణం ప్రతిబింబించే ఏర్పాట్లు చేశారు. గంగిరెద్దులు, డూడు బసవన్నలు, ఎడ్లబండ్లు, ముత్యాల గొబ్బెమ్మలు, ముగ్గుల రంగవల్లులతో పండుగ శోభ పెరిగింది, కోలాటం, కర్రసాము, కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ వంటి సంప్రదాయ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించి కార్యక్రమాన్ని ఉత్సాహంగా ముగించారు. రాష్ట్ర డి.జి.పి. సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఐక్యత, సామరస్యం, సానుకూల జీవనంపై సందేశం ఇచ్చారు. నగర పోలీస్ కమీషనర్ డి.జి.పి.కి కృతజ్ఞతలు తెలుపుతూ పోలీస్ కుటుంబాలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బెట్టింగులు, కోడిపందాలు ఆడవద్దని సూచిస్తూ సంప్రదాయ క్రీడలతో ఆనందంగా సంక్రాంతి జరుపుకోవాలని పిలుపునిచ్చారు..


